సాక్షి
మెదక్
మంగళవారం ׀ 6 ׀ మే ׀ 2025



రెగ్యులర్ ఈవో కలేనా!

ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోతుంది.

వివరాలు 8లో ▸



వివాహితను కాపాడిన షీటీం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహితను షీ టీమ్ బృందం కాపాడింది.

వివరాలు 8లో ▸



మంజీరాలో మృత్యు ఘోష

మెదక్ పాలిట వరంలా మారిన మంజీరాలో ప్రస్తుతం మృత్యు ఘోష వినిపిస్తోంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

'మోడల్'లో ఇంటర్ ప్రవేశాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్ కాలేజీలో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ వాణికుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని హార్డ్ కాపీని కాలేజీలో అందించాలని సూచించారు. బాలికల కోసం హాస్టల్ సౌకర్యం ఉందని వివరించారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు సిద్దేశ్వర పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, ప్రముఖ కళాకారుడు ఏపూరి సోమన్న అన్నారు. మండల పరిధి పిల్లుట్లలో హిందూ బీసీ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి బండారి గంగాధర్ ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని సోమవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

ఫార్మర్ ఐడీకి ఇబ్బందులు



ఆన్‌లైన్‌లో రైతుల వివరాల నమోదుకు ప్రయత్నిస్తున్న ఏఈఓ సాహితి

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డుల నమోదు (ఫార్మర్ ఐడీ కార్డులు) మొదట్లోనే ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమవారం కౌడిపల్లి పంచాయతీ వద్ద వ్యవసాయ అధికారులు అగ్రి యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసే కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే యాప్‌లో సర్వే నంబర్లు నమోదు చేసినా భూముల వివరాలు రాలేదు. దీంతో రైతులకు ఫార్మర్ ఐడీ రిజిస్టర్ కాలేదు. ఈ సమస్యను ఏఈఓలు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు తెలియజేశారు. అగ్రియాప్‌లో భూభారతి వివరాలు నమోదు కాలేదని, దీంతో సమస్యగా మారిందని తెలిపారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

కార్మికుల సమస్యలపై పోరాటం: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం తెలిపారు. సోమవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 3, 4 తేదీల్లో రెండు రోజులపాటు రామాయంపేటలో నిర్వహించిన జిల్లా మహాసభలు జయప్రదంగా ముగిశాయని అన్నారు. జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న 17 రకాల సమస్యలపై ఈ మహాసభలో తీర్మానం చేశామన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానికులకు ఉద్యోగాలు దొరకడం లేదని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బాలమణి, సహాయ కార్యదర్శి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు తావు లేదు: ఏఎస్పీ మహేందర్



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని చెప్పారు.

పాదచారి.. నడిచే దారేది?



మున్సిపాలిటీల్లో కానరాని ఫుట్‌పాత్‌లు

- రోడ్లపై నడుస్తున్న పాదచారులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్‌జామ్
- నోటీసులు ఇచ్చినా స్పందించని ఆక్రమణదారులు



మెదక్ పట్టణంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారులు

మెదక్‌జోన్: మున్సిపాలిటీల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. చిరు వ్యాపారుల నుంచి మొదలుకొని పెద్ద వ్యాపారుల వరకు దర్జాగా ఆక్రమించేస్తున్నారు. వస్తువులు, సామగ్రిని అడ్డుగా పెట్టడంతో పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ జామ్‌తో పాటు తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయాలని ఆక్రమణదారులకు మున్సిపల్ సిబ్బంది నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడం లేదు.

90 శాతం మేర ఆక్రమణ

జిల్లాలోని మెదక్, నర్సాపూర్ మున్సిపాలిటీల్లో రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లు 90 శాతం మేర ఆక్రమణకు గురయ్యాయి. చిరు వ్యాపారులతో పాటు బడా వ్యాపారుల వరకు ఫుట్‌పాత్‌పై దర్జాగా సామగ్రి పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధానంగా మెదక్ జిల్లా కేంద్రంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర పట్టణం మధ్య నుంచి ప్రధాన రహదారి ఉంది. 100 ఫీట్ల రోడ్డు కావటంతో మధ్యలో డివైడర్‌ను నిర్మించారు. రోడ్డుకు ఇరువైపులా పాదచారుల కోసం ప్రత్యేకంగా ఫుట్‌ఫాత్‌ను నిర్మించారు. కానీ ఆక్రమణదారులు దానిని యథేచ్ఛగా కబ్జా చేశారు. జిల్లా నలుమూలల నుంచి పట్టణానికి నిత్యం వేలాది మంది వివిధ పనులపై వస్తుంటారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావటంతో రోడ్లపై నడిచి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫుట్‌పాత్‌లను వెంటనే ఖాళీ చేయాలని మెదక్ మున్సిపల్ సిబ్బంది 120 మందికి నోటీసులు జారీ చేశారు. అయితే ఆక్రమణదారుల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని అధికారులు చెబుతున్నారు. అలాగే కొన్ని వార్డుల్లో డ్రైనేజీలపై ఏకంగా పర్మనెంట్ నిర్మాణాలు చేపట్టారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో సైతం ఫుట్‌పాత్‌ను ఆక్రమించగా, ఇటీవల మున్సిపల్ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో వాటిలో కొన్నింటిని బలవంతంగా తొలగించారు. దీంతో రెచ్చిపోయిన ఆక్రమణదారులు మళ్లీ యథావిధిగా ఫుట్‌పాత్‌లపై తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు.

అధికార పార్టీ నేతల మద్దతు

మెదక్, నర్సాపూర్ మున్సిపాలిటీల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న ఆక్రమణదారులకు అధికార పార్టీ నేతలు వత్తాసు పలుకుతున్నారు. ఫలానా వ్యక్తి మన వాడు, అతడు ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసుకున్న డబ్బాను ముట్టుకోవద్దని మున్సిపల్ సిబ్బందికి హుకుం జారీ చేస్తున్నారు. దీంతో అధికారులు సైతం మౌనంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకరిని చూసి మరొకరు రెచ్చిపోతున్నారని, మేం ఏం చేయలేకపోతున్నామని మున్సిపల్ సిబ్బంది చెప్పకనే చెబుతున్నారు.

ఎవ్వరిని ఉపేక్షించం



కొంతమంది చిరు వ్యాపారులతో పాటు బడా వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించారు. అలాంటి వారికి కొంత గడువు ఇస్తూ నోటీసులు జారీ చేశాం. గడువులోగా తొలగించకుంటే ఎవ్వరిని ఉపేక్షించం. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించిన వాటిని తొలగించి తీరుతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ కమిషనర్

భూ భారతితో సమస్యలు దూరం

కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎమ్మెల్యే సునీతారెడ్డి, అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లాలో భూభారతి పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన చిలప్‌చెడ్ మండలంలోని రాందాస్‌గూడ, రహీంగూడ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలున్న ప్రతి ఒక్కరూ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన ఆధారాలతో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ధరణిలో పరిష్కారం కాని ప్రతి సమస్యకు భూ భారతిలో ఆప్షన్ ఉందన్నారు. చిలప్‌చెడ్ మండలంలో ఈనెల 14 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ సోమక్కపేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా లేకుండా చూసుకోవాలన్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. ధరణిలో 80 శాతం వరకు భూసమస్యలు పరిష్కారమయ్యాయని, మిగితా సమస్యలు భూ భారతిలో పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్లు సహదేవ్, అంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేదలు ఇళ్లు నిర్మించుకోవాలి

నర్సాపూర్ రూరల్: నిరుపేదలు ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం మండలంలోని ఆద్మాపూర్‌లో పర్యటించి లబ్ధిదారులను ధ్రువీకరించారు.

సీఎం వ్యాఖ్యలు సరికాదు: ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్‌గౌడ్

మెదక్‌జోన్: ఉద్యోగులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం మెదక్‌లోని ఎస్టీయూ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ సంఘాలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. న్యాయంగా రావాల్సిన డీఏ, పీఆర్సీ, జీపీఎఫ్ రెండు సంవత్సరాలుగా రావడం లేదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వమని అడగడం తప్పా అని ప్రశ్నించారు. సబ్ కమిటీ పేర్కొన్న విధంగా పెండింగ్ బిల్లుల కోసం రూ. 500 కోట్లు విడుదల చేస్తామని చెప్పి ఇప్పటివరకు రూపాయి విడుదల చేయలేదని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి కిష్టయ్య, జిల్లా బాధ్యులు భూపతిగౌడ్, అరుణ్ దేవదాస్, మెదక్, పాపన్నపేట, రామాయంపేట, కొల్చారం మండలాల అధ్యక్షులు జబ్బార్, మల్లేశం, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



కమిషనర్‌పై ఫిర్యాదు చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ తదితరులు

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌ఓ భుజంగరావు, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీసీఈఓ ఎల్లయ్యతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు మొత్తం 56 వినతులు సమర్పించారు. అందులో అధికంగా భూ సమస్యలతో పాటు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లపై అర్జీలు ఇచ్చారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేసినా మెదక్ మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదని, ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే రాందాస్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై చర్యలు చేపట్టాలని కోరారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోయి రెండేళ్లుగా నీరు రావడం లేదని స్కూల్ తండా గిరిజనులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గుక్కెడు నీటికోసం అల్లాడుతున్నామని.. స్పందించి తాగు నీటి గోస తీర్చాలని వేడుకున్నారు.

రసాయనాల వాడకం తగ్గించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు శాంతి, రవీందర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శాంతి

నర్సాపూర్ రూరల్: రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు శాంతి, రవీందర్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పెద్ద చింతకుంటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు సాంకేతిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు పంటలు సాగు చేసుకునే ముందు తమ భూముల మట్టి నమూనాలు పరీక్షించుకోవాలన్నారు. రిపోర్టుల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏడీ సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రతి రైతు గ్రామాల్లోని ఏఈఓల వద్ద ఫార్మర్ ఐడీ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని దీపిక, ఏఈఓలు లక్ష్మి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు నాగమణి, హరీష్ రైతులు పాల్గొన్నారు.

నిండుకున్న సన్న బియ్యం

- రేషన్ డీలర్ల ఎదురుచూపులు
- ఈనెల రావాల్సింది 3,500 మెట్రిక్ టన్నులు
- వచ్చింది 2 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే



పాపన్నపేట ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిండుకున్న సన్న బియ్యం నిల్వలు

పాపన్నపేట(మెదక్): సన్న బియ్యం పథకానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. మండల స్థాయి స్టాక్ పాయింట్లలో బియ్యం నిల్వలు నిండుకున్నాయి. దీంతో రేషన్ డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల చుట్టూ తిరుగుతున్నారు. లబ్ధిదారులు సన్న బియ్యం కోసం ఎదురు చూస్తున్నారు. ఈనెల 3,500 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం అవసరం ఉండగా, ఇప్పటివరకు 2 వేల మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. జిల్లాలో మొత్తం 520 రేషన్ షాపులకు గాను, 270 షాపులకు బియ్యం చేరాయి. అలాట్‌మెంట్ ఆలస్యం కావడంతో ఇబ్బందులు తలెత్తినట్లు తెలుస్తోంది.

మొత్తం 520 రేషన్ షాపులు

జిల్లాలో 2,14,278 రేషన్ కార్డులు ఉండగా, 7,11,976 లబ్ధిదారులున్నారు. ప్రతి నెలా 4,522 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. గత నెల నిల్వలు పోను ఈనెల 3,500 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమున్నాయి. జిల్లాలో 520 రేషన్ షాపులు ఉండగా, ఇప్పటివరకు 270 షాపులకు సన్న బియ్యం అందినట్లు తెలుస్తోంది. మిగితా రేషన్ షాపుల డీలర్లు ఎంఎల్ఎస్ పాయింట్ల చుట్టూ తిరుగుతున్నారు. పాపన్నపేట, టేక్మాల్ మండలాలకు కలిసి పాపన్నపేట ఎంఎల్ఎల్ పాయింట్ ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తారు. రెండు మండలాల్లో కలిపి 74 రేషన్ షాపులు ఉండగా, 4,446.84 క్వింటాళ్ల సన్న బియ్యం రావాలి. అయితే ఇప్పటివరకు 3,041 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ఇంకా 1,405 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉంది. 74 రేషన్ షాపుల్లో, 48 షాపులకు బియ్యం సరఫరా చేశారు. మిగితా 26 షాపులకు రేషన్ రావాల్సి ఉంది. ఆదివారం నాటికి ఎంఎల్ఎస్ పాయింట్లో సన్న బియ్యం నిల్వలు నిండుకున్నాయి. దీంతో డీలర్లు తిరిగిపోతున్నారు. ప్రతి నెలా మొదటి తేదీన బియ్యం తీసుకునే వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలాట్‌మెంట్ ఆలస్యం

ప్రతి నెలా 20వ తేదీ వరకు కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాలకు రేషన్ బియ్యం అలాట్‌మెంట్ జరుగుతుంది. ఒకటో తేదీ నుంచి 10లోగా లబ్ధిదారులకు రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ జరిగేది. కానీ ఈసారి ఏప్రిల్ 27న అలాట్‌మెంట్ జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం, కార్డుల్లో పేర్ల చేర్పులు, తొలగింపులు తదితర కారణాల వల్ల అలాట్‌మెంట్ ఆలస్యమైనట్లు తెలుస్తోంది.

రేషన్ బియ్యం వస్తేనే పూట గడిచేది



నాకు భర్త లేదు. గుంట భూమి లేదు. రేకుల ఇల్లు.. పెళ్లీడుకొచ్చిన బిడ్డ ఉంది. 35 కిలోల రేషన్ బియ్యం వస్తేనే పూట గడుస్తుంది. గతంలో దొడ్డు బియ్యం నెల మొదట్లోనే వచ్చేవి. ఈసారి సన్న బియ్యం వస్తాయన్నారు. ఐదు రోజులుగా ఎదురుచూస్తున్నాం.

– మెగావత్ కమ్లీ, ధూంలా తండా

10 వరకు పంపిణీ పూర్తి చేస్తాం

అలాట్‌మెంట్ ఆలస్యమైనందు వల్ల రేషన్ సప్లైలో జాప్యం జరగుతుంది. ఈనెల 10 వరకు రేషన్ షాపులకు పూర్తిస్థాయిలో సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకుంటాం. రామాయంపేట, తునికి గోదాంలలో సన్న బియ్యం నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

– జగదీశ్వర్, డీఎం, సివిల్ సప్లై

అండర్‌పాస్‌లు.. సర్వీసు రోడ్లు



నిర్మాణాలకు రూ. 44.77 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని కోమటిపల్లి, వల్లూరు వద్ద సర్వీస్ రోడ్లు, వడియారం వద్ద అండర్‌పాస్‌ల నిర్మాణానికి కేంద్రం రూ. 44.17 కోట్లు మంజూరు చేసింది. వడియారం అండర్ పాస్ వద్ద కిలోమీటర్, కోమటిపల్లి, వల్లూరు జంక్షన్ల వద్ద రెండున్నర కిలోమీటర్ల మేర సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు జాతీయ రహదారుల శాఖ అధికారులు వెల్లడించారు. వీటి నిర్మాణం పూర్తయితే ఈ జంక్షన్ల వద్ద రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గే అవకాశం ఉంది. కోమటిపల్లి వద్ద జాతీయ రహదారి–44 దాటుతున్న క్రమంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామ శివారులో కేజీబీవీతో పాటు మోడల్ స్కూల్ ఉంది. ఈ రెండు స్కూళ్లలో కనీసం 500 వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. కస్తూర్బా విద్యార్థులు స్కూల్ హాస్టల్‌లోనే ఉంటుండగా, మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిరోజు వెళ్లి వస్తుంటారు. స్కూల్ ముగియగానే తిరిగి ఇళ్లకు వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన విజ్ఞప్తి మేరకు కేంద్రం రూ. 44.17 కోట్లు మంజూరు చేసింది. విద్యార్థులు జాతీయ రహదారిపైకి వెళ్లకుండా నేరుగా సర్వీస్ రోడ్డు మార్గంలోనే స్కూళ్లకు వెళ్లే విధంగా రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు. జాతీయ రహదారుల శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కాగా వడియారం వద్ద జాతీయ రహదారిపై నిర్మించనున్న అండర్ పాస్ బ్రిడ్జి వద్ద 6 వరుసల రోడ్డు నిర్మించనున్నారు.

ప్రజల కోరిక మేరకే..



జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్య లు తీసుకుంటున్నాం. ఇందు లో భాగంగా కోమటిపల్లి, వల్లూరు వద్ద జంక్షన్ల అభివృద్ధి, బైపాస్ రోడ్ల నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. ప్రజల విజ్ఞప్తి మేరకే తాను నిధులు మంజూరు చేయించా.

– రఘునందన్‌రావు, ఎంపీ

రెగ్యులర్ ఈవో కలేనా!

ఇన్‌చార్జీలతోనే ఏడుపాయల ఆలయం

- ఇటీవల రంగారెడ్డి జిల్లాకు ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్ బదిలీ
- అయినా తప్పని ఉమ్మడి మెదక్ జిల్లా అదనపు బాధ్యతలు
- తలకు మించిన భారంతో సతమతం
- రెగ్యులర్ ఈవో లేక భక్తులకు వసతులు కరువు



చంద్రశేఖర్ అసిస్టెంట్ కమిషనర్

పాపన్నపేట(మెదక్): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆలయానికి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోతుంది. మెదక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్, ఏడుపాయల ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖర్‌ను నాలుగు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో రెండు జిల్లాల అదనపు కమిషనర్‌గా.. ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా బహుముఖ బాధ్యతలు నిర్వహించలేక.. తలకు మించిన భారంతో సతమత మవుతున్నారు. తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయలకు రెగ్యులర్ ఈవో లేక భక్తులు అవస్థల పాలవుతున్నారు.

రెండు జిల్లాల ఆలయాల బాధ్యతలు

మెదక్ ఉమ్మడి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న చంద్రశేఖర్ రెండేళ్ల కిందట ఏడుపాయల ఇన్‌చార్జి ఈవోగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెండు బాధ్యతలు చూస్తూ వస్తున్నారు. నాలుగు రోజుల కిందట రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడి నుంచి బదిలీ అయినా పాత పోస్టులు కూడా అలానే ఉంచడంతో పని భారం ఎక్కువైంది. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట మూడు జిల్లాల్లో కలిసి గుర్తింపు పొందిన 36 పెద్ద దేవాలయాలతోపాటు, చిన్నాచితక సుమారు 3 వేల ఆలయాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సుమారు 6 వేల దేవాలయాల వరకు ఉంటాయని తెలుస్తుంది. వీటన్నింటికీ అసిస్టెంట్ కమిషనర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు నిర్వర్తించాలంటే తలకు మించిన భారమే అవుతుంది.



ఏడుపాయల పుణ్యక్షేత్రం

రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా..

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన దేవాలయం ఏడుపాయల. 6ఏ టెంపుల్‌గా గుర్తింపు పొందిన వన దుర్గమ్మ ఆలయం దర్శించుకోవడానికి యేటా సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తారు. సుమారు రూ.15 కోట్ల ఆదాయం ఉంటుంది. ఆది, మంగళ, శుక్ర వారాల్లో వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. మహాశివరాత్రి జాతరకు సుమారు 12 లక్షల భక్తులు వస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల దేవాలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం దురదృష్టకరమని భక్తులు వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించే నాథుడే లేడని అంటున్నారు.

ఏళ్ల కొద్దీ ఇన్‌చార్జీలతో పాలన

2023లో ఈవో సార శ్రీనివాస్ బదిలీ అయిన తర్వాత మోహన్ రెడ్డి వచ్చారు. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత అసిస్టెంట్ కమిషనర్ వినోద్ రెడ్డి, క్రిష్ణ ప్రసాద్ వచ్చారు. అప్పట్లో నెల లోపు ముగ్గురు ఈవోలు మారారు. అనంతరం వచ్చిన అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఇన్‌చార్జి ఈవోగా కొనసాగుతూ ఇటీవల రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. అయినా ఆయనకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. బహుముఖ విధులు నిర్వరిస్తున్న ఆయన ఏడుపాయలకు పూర్తిగా న్యాయం చేయలేక పోతున్నారని భక్తులు వాపోతున్నారు. గతంలో ఎంతో మంది గ్రేడ్–2 ఈవోలు ఏడుపాయల ఈవోలుగా పని చేశారు. ఈ క్రమంలో గ్రేడ్–2 స్థాయి ఈవోనైనా నియమించి తమ ఇబ్బందులు తీర్చి ఏడుపాయల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు.

అమ్మానాన్నల కల సాకారం

తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా సాహితీ

నంగనూరు(సిద్దిపేట) : సిద్దిపేట జిల్లా నంగనూరు మండల కేంద్రానికి చెందిన మల్యాల సాహితీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. అమ్మానాన్నల ప్రోత్సాహంతో తొలి ప్రయత్నంలోనే.. 26 ఏళ్ల వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఉద్యోగం సాధించింది.

సాహితీ సిద్దిపేట పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్ చదివింది. బెంగుళూరులోని రెవా యూనివర్సిటీలో 2017–22 వరకు బీబీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. 2022–24 వరకు హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి లా కళాశాలలో ఎల్ఎల్ఎమ్ పూర్తి చేయగా అంతలోనే జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు నోటిఫికేషన్ వచ్చింది. జూన్ 2024లో ప్రిలిమ్స్, నవంబర్‌లో జరిగిన మెయిన్స్‌లో అర్హత సాధించింది. ఏప్రిల్ 2025లో ఇంటర్వ్యూలు అయ్యాయి. అదే నెల 30న జూనియర్ సివిల్ జడ్జి నియామకాలకు సంబంధించి ఫలితాలు విడుదల కాగా మల్యాల సాహితీ ఎంపికైంది. జడ్జిగా ఎంపిక కావాలని పట్టుదలతో సాహితీ 10 నెలల పాటు కష్టపడింది. ప్రతి రోజూ 8 నుంచి రాత్రి 10 గంటల పాటు ఇంటి దగ్గరనే సన్నద్ధమైంది. పుస్తకాల నుంచి తానే సొంతంగా స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంది.



కోర్టు వద్ద సాహితీ

మా కలను కూతురు నెరవేర్చింది



మేము ఇంటర్ చదువుతున్న సమయంలోనే మాకు వివాహమైంది. చదువు మధ్యలోనే ఆపేశాం. మా పిల్లలకు ఎప్పుడు చెప్పుబుతుంటాం.. మేము చదువుకోలేకపోయాం.. మీరు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని. నేడు మా కలను సాహితీ నెరవేర్చింది. మా వంశంలోనే న్యాయవ్యవస్థలో జడ్జి ఉద్యోగం సాధించిన మొదటి వ్యక్తి మా సాహితీ.

– మల్యాల రాజు, అన్నపూర్ణ తల్లిదండ్రులు

వివాహితను కాపాడిన షీ టీమ్ బృందం

అత్తింటి వేధింపులతో ఆత్మహత్యాయత్నం

నర్సాపూర్ రూరల్: చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న వివాహితను షీ టీమ్ బృందం సభ్యులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల జ్యోతి కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక సోమవారం నర్సాపూర్ రాయ రావు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు బయలుదేరింది. చెరువు ప్రాంతంలో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న షీ టీమ్ బృందం సభ్యులు దేవదాస్, స్వామి సకాలంలో స్పందించారు. వెంటనే వెళ్లి జ్యోతిని కాపాడి నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. జ్యోతి భర్త లింగం, అత్త, మరిదితో పాటు ఇతర కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా వేధింపులకు గురి చేస్తున్నారని పలు మార్లు పంచాయితీ పెట్టినా మారకపోవడంతో విసుగు చెంది ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ఏడేళ్ల కిందట పిచ్చకుంట్ల గ్రామానికి చెందిన లింగంతో వివాహం జరిగిందని, ప్రస్తుతం ఇద్దరు కుమారులు కూడా ఉన్నట్లు చెప్పింది. తల్లిదండ్రులు నర్సాపూర్ లో నివాసం ఉంటారని పేర్కొంది.



జ్యోతితో మాట్లాడుతున్న షీ టీమ్ బృందం సభ్యుడు దేవదాస్

క్లుప్తంగా

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మద్దూరు యువకుడు



కార్తీక్ గౌతమ్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): సౌత్‌జోన్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌కు మండల కేంద్రానికి చెందిన బేజాడి కార్తీక్ గౌతమ్‌రెడ్డి ఎంపికైనట్లు మెదక్ జిల్లా హ్యాండ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. 9 నుంచి 12 వరకు తమిళనాడు రాష్ట్రంలో జరిగే టోర్నమెంట్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డిని సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుకూరి ఉపేందర్ గుప్తా, దామెర మల్లేశం, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

టేక్మాల్(మెదక్): తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని సంగ్యాతండా పంచాయతీ పరిధిలోని కడిలాబాయి తండాలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కున్‌సోత్ మోహన్ కుటుంబ సభ్యులు ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులతోపాటు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికొచ్చే సరికి గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాలోని తులం బంగారం, 35 తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు, బైకు ఢీ : ఒకరు మృతి

పెద్దశంకరంపేట(మెదక్): కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పెద్దశంకరంపేట శివారులో చోటు చేసుకుంది. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ట్రైనీ ఎస్ఐ అరవింద్ కథనం మేరకు.. భీమన్నపల్లి మురళీ క్రిష్ణ(32), అంజన్నగారి హరీశ్ పెద్దశంకరంపేట వైపు నుంచి మల్కాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో రేగోడ్ వైపు నుంచి పేట వైపు వస్తున్న కారు ఢీకొట్టడంతో మురళీ క్రిష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. హరీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

ఇంటి నుంచి వెళ్లి..

శివ్వంపేట(నర్సాపూర్) : ఇంటి నుంచి వెళ్లి మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన బత్తులు లక్ష్మీ (58) గత నెల 24న పాంబండలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లింది. రెండు రోజుల ద్వారా ఇంటికొస్తానని చెప్పడంతో కుటుంబ సభ్యులు గ్రామానికి వెళ్లిపోయారు. 26న కుటుంబ సభ్యులు పాంబండలో ఉన్న బంధువులకు లక్ష్మీ గురించి ఫోన్ చేయగా ఉదయమే పోతుల బోగూడకి బయలుదేరిందని చెప్పారు. ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. లక్ష్మీ కుమారుడు నాగులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో..

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత అదృశ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్‌కు చెందిన జర్రు శారద భర్త చనిపోవడంతో ఏడాది కిందట ప్రమోద్ అనే వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. శారద కోసం తల్లిదండ్రులు తెలిసిన చోట వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నాణ్యమైన మందులు అందించాలి

గజ్వేల్‌రూరల్: మెడికల్ దుకాణాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన మందులు అందించి వారి మన్ననలు పొందాలని తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ జిల్లా అధ్యక్షుడు తొడుపునూరి రాజు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం గజ్వేల్ ఏరియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవదాసు, ఉపాధ్యక్షుడిగా సంతోష్, జనరల్ సెక్రటరీగా యాదగిరి, రాజుగౌడ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అదే విధంగా సీడీఏ జిల్లా జనరల్ సెక్రటరీగా వేముల వెంకటేశ్వర్‌రావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన మందులను అందించడంతోపాటు వారి మన్ననలను పొందాలని సూచించారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లా డీసీఏ సభ్యులు పాల్గొన్నారు.



ఎన్నికైన దేవదాసు, సంతోష్, రాజుగౌడ్

దళిత యువకుడిపై దాడి అమానుషం

సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్‌కు చెందిన బేడ బుడిగ జంగం దళిత యువకుడిపై బీజేపీ మతోన్మాద ఆర్ఎస్ఎస్, హిందుత్వ బజరంగ్ దళ్ కార్యకర్తలు దాడి చేయడం అమానుషమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సోమవారం ఎల్లదాసునగర్‌కు వెళ్లి బాధితుడితో మాట్లాడి కొత్త దుస్తులు అందించారు. అనంతరం అక్కడి నుంచి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు. సీపీఎం నాయకులు శశిధర్, సత్తిరెడ్డి, వెంకట్‌మావో, బాల్ నర్సయ్య, యాదగిరి, రవికుమార్, ప్రశాంత్, శారద, రాజు, నాగరాజు, శ్రీహరి, ప్రభాకర్, మల్లేశం, అశోక్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఐ ఆధ్వర్యంలో..

దళిత యువకుడిపై దాడిని నిరసిస్తూ సీపీఐ నాయకులు పట్టణ కేంద్రంలో రాస్తారోకో చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ.. దళిత యువకుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు భూమయ్య, యాదగిరి, భాస్కర్‌రెడ్డి, నర్సింహా చారి, నర్సయ్య, ఎల్లయ్య, బాపురాజు, సత్తయ్య, రాజు, సీతారామయ్య, యాదయ్య, నర్సింహులు, యాదవ్వ, ఇస్తారి, లచ్చయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి యువతి ఆత్మహత్య



ప్రియాంక (ఫైల్)

పాపన్నపేట(మెదక్): చెరువులో దూకి యువతి ఆత్మహత్యకు పాల్పడింది.ఈ ఘటన మండల పరిధిలోని మల్లంపేటలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్లంపేట గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య, శామల దంపతులకు ముగ్గురు ఆడ పిల్లలు. మల్లయ్య కరోనా సమయంలో చనిపోయాడు. తల్లి ఇద్దరు ఆడపిల్లల వివాహాలు చేసింది. బతుకు భారం కావడంతో శ్యామల చిన్న కూతురు ప్రియాంక(20)తో కలిసి హైదరాబాద్‌కి వలస పోయి జీవిస్తుంది. ఇటీవల రెండు నెలల కిందట తల్లీబిడ్డలు స్వగ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక ఫోన్‌లో మాట్లాడుతూ రెడ్ల చెరువు వద్దకు వెళ్లి నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

స్నేహితుల మధ్య గొడవ

ఉరేసుకున్న యువకుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాజు(32) జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన సుందర్, దిలీప్‌తో కలిసి మెలసి ఉండేవాడు. రెండు రోజుల కిందట రాజు ఫోన్ పోయింది. తోటి మిత్రులను మీరే తీశారని అడుగగా మాకు తెలీదని చెప్పారు. వినకుండా రాజు వారి బైక్‌ను తీసుకెళ్లాడు. బైక్ విషయంలో స్నేహితులు, రాజుకు మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన ఆదివారం రాజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. భార్య మధురవాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

టైరు పేలి కారు బోల్తా

టేక్మాల్(మెదక్): అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి శివారులోని 161 హైవేపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వైపు కారు వేగంగా వెళ్తుండగా టైరు పగిలింది. దీంతో డివైడర్ అవతలి వైపునకి వెళ్లి రోడ్డుపై బోల్తా పడింది. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వాహనం పూర్తిగా దెబ్బంతి. హైవే సిబ్బంది రోడ్డుపై నుంచి కారును తొలగించారు.



బోల్తా పడిన కారు

బోల్తా పడిన బైక్

టేక్మాల్ మండలంలోని కాద్లూర్ శివారులో అదుపుతప్పి బైక్ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. రేగోడు మండలం మర్పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మెదక్ వైపు నుంచి బొడ్మట్‌పల్లి వైపునకు బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడ్డాడు. అతివేగంగా, అజాగ్రత్తగా రావడంతోనే ప్రమాదం చోటు చేసుకుంది. వ్యక్తికి తలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సాగు అంశాలపై అవగాహన కల్పించడానికే..

- 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం
- వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్

రామాయంపేట(మెదక్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు అందించడానికి వీలుగా ప్రభుత్వం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని చేపట్టిందని వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాములు నాయక్ పేర్కొన్నారు. మండలంలోని రాయిలాపూర్ రైతువేదికలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చిన్నకారు, సన్నకారు రైతుల లభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలు గుర్తించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి కమిషన్ కృషి చేస్తుందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో జరుగుతున్న పరిశోధన ఫలితాలను రైతులకు వివరించి వారికి చైతన్యపర్చడానికి అవగాహన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ మాట్లాడుతూ.. రైతులకు సాంకేతిక సలహాలను అందిస్తే పెట్టుబడులు తగ్గడంతోపాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. 13వ తేదీ వరకు కొనసాగే అవగాహన శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శోభారాణి, రామాయంపేట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాములు నాయక్

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తూప్రాన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ శివానందం సోమవారం తెలిపారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామ శివారులో హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను ఫిల్టర్ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు పోలీసుల రాకను చూసి పారిపోయినట్లు తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు నాగరాజు, సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

అసైన్డ్ భూములు కబ్జా

- మీర్జాపూర్, తోటపల్లి శివారు సరిహద్దులో రైతుల ఆక్రమణలు
- కుంట కట్టలు ధ్వంసం, నీటి కాల్వలు పూడ్చివేతలు
- పూడికతీత పనులు చేపడితేనే మేలు



వైదేరు కుంట కట్టను ధ్వంసం చేసి చదును చేస్తున్న యంత్రాలు

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సమీప రైతులు ఆక్రమణలకు పాల్పడుతూ ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదల భూములకు సాగు నీరు సౌకర్యం లేకపోవడంతో పంటలు వేయక బీడు వారడంతో ఇదే ఇదునుగా భావించిన రైతులు హద్దు రాళ్లు జరిపి ఆక్రమిస్తున్నారు.

కరువుతో సాగుకు దూరం

తోటపల్లి రెవెన్యూ పరిధిలో వైదేరు కుంట దగ్గర పేదలకు 2.20 ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం పేదలకు ఇచ్చింది. ఒకప్పుడు కుంట తూము పారకంతో పంటలు పండించిన రైతులు కరువుతో కుంటలు ఎండిపోవడంతో సాగు చేయలేకపోతున్నారు. పేదలకు ఇచ్చిన భూమిలో చెట్లను అమ్ముకోవడం, గెట్టు జరిపి భూమి కలుపుకోవడం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు భూ సర్వే చేసి పేదల భూములకు హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కుంట కట్టలు ధ్వంసం..

హుస్నాబాద్ మండలంలో చిన్న నీటి వనరులను అభివృద్ధి చేయడానికి గొలుసు కట్టు కుంటలు, చెరువులను నిర్మించారు. ఇవి పూడికతో నిండిపోవడంతో గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా పూడిక పనులు చేయించి చెరువు, కుంటలకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. చిన్న నీటి కుంటలను సమీప రైతులు కట్టలను ధ్వంసం చేసి బఫర్ జోన్ గొలుసు భూమిని ఆక్రమిస్తున్నారు. శుక్రవారం మీర్జాపూర్, తోటపల్లి శివారు సరిహద్దు లోని వైదేరు కుంట కట్టను ఓ రైతు ధ్వంసం చేసి చదును చేయడంతో పొరుగు రైతులు అడ్డుకొని ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన అధికారులు జేసీబీ, డోజర్ తాళాలు తీసుకొని వెళ్లిపోయారు. తోటపల్లిలో మాసాని కుంట, ఎర్ర కుంట, వట్టే కుంట, మీర్జాపూర్‌లోని మంచీళ్ల కుంట శిఖం భూములను రైతులు ఆక్రమించి చదును చేస్తున్నారు. 20 చెరువులు, కుంటలకు ఒక ఏఈని ఇరిగేషన్ అధికారులు నియమించినా అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో పర్యవేక్షణ లేకుండా పోతుందని ఆరోపిస్తున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



మా ఎస్సీలకు వైదేరు కుంట కింద 2.20 ఎకరాలను ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇచ్చింది. కొద్ది రోజులు కుంట నీరుతో పంటలు సాగు చేసిన కరువుతో తూములు కూలిపోవడంతో నీటి కాల్వలు, అలుగును ధ్వంసం చేయడంతో మాకు నీళ్లు లేకుండా పోయాయి. కుంట కట్టను ధ్వంసం చేసి మా భూమిని ఆక్రమించే రైతులపై చర్యలు తీసుకోవాలి.

– మేదిని వెంకటస్వామి, గాంధీనగర్

కుంట కట్ట గొలుసు వరకు బఫర్ జోనే..



చెరువు, కుంట కట్టల కింద గొలుసు వరకు బంఫర్ జోన్ భూములే ఉంటాయి. వీటిని ఎవరు చదును చేయరాదు, ఆక్రమించరాదు. వైదేరు కుంట కట్ట ధ్వంసం చేసిన విషయం విచారణ జరిపి వాహనాలను స్వాధీనం చేసుకొని రైతు పై కేసు నమోదు చేయిస్తాం. శిఖం, నీటి కాల్వలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, ఏఈ ఇరిగేషన్

46 రోజుల తర్వాత తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి

చదువుపై ఇష్టం లేక వెళ్లిపోయానని చెప్పిన బాలుడు

వట్‌పల్లి (అందోల్): హాస్టల్ నుంచి 46 రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని సోమవారం వట్‌పల్లి పోలీసులు పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. రేగోడ్ మండలం పెద్ద తండాకు చెందిన మెగావత్ లక్ష్మీ, రవి దంపతుల కుమారుడు మండల పరిధిలోని దేవునూర్ బాలుర హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా మార్చి 20న హాస్టల్ నుంచి ఇంటికి రాలేదు. విద్యార్థి తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు వెళ్లి కుమారుడు ఎక్కడికి వెళ్లాడని హాస్టల్ వార్డెన్‌ను నిలదీయగా ఆచూకీ లభించలేదు. ఏప్రిల్ 4న వట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. విచారణలో భాగంగా విద్యార్థి హైదరాబాద్‌లో ఉంటున్నాడని దర్యాప్తులో తేలింది. సోమవారం విద్యార్థిని వట్ పల్లికి తీసుకొచ్చి విచారించగా చదువుకోవడం ఇష్టం లేకనే హాస్టల్ నుంచి వెళ్లిపోయినట్లు తెలిపాడు. ఆ తర్వాత తల్లిదండ్రుల సమక్షంలో అతడికి కౌన్సిలింగ్ చేసి వారికి అప్పగించారు.